తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్
94949 23460

https://epaper.tharangalu.in
RNI. TELTEL / 2022 / 83463
జాతీయ దిన ప్రతిక
తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
మంగళవారం,
24 ఫిబ్రవరి,2026,
సంపుటి: 125
సంచిక :3
వేల: రూ.5/-

Published From:Hyderabad,Circulated:Hyderabad,Nalgonda,khammam,Rangareddy,Sangareddy,Warangal,Kurnool,Amaravathi,Krishna

నేపాల్‌లో ఘోర
బస్సు ప్రమాదం

లోయలోని త్రిశూలి నదిలో పడిన ప్రయాణికుల బస్సు
18 మంది అక్కడికక్కడే మృతి
26 మందికి తీవ్ర గాయాలు
విదేశీ పర్యాటకులు కూడా బాధితుల్లో ఉండటం విచారం

ఖాట్మండు, ఫిబ్రవరి 23 (తరంగాలు ప్రతినిధి,): పొరుగు దేశం నేపాల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ధాడింగ్ జిల్లాలో ప్రయాణికులతో వెళ్తున్న బస్సు అదుపుతప్పి రహదారి నుంచి సుమారు 300 మీటర్ల దిగువన ఉన్న లోయలో ప్రవహిస్తున్న త్రిశూలి నదిలో పడిపోయింది. ఈ దుర్ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న 18 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో 26 మందికి తీవ్ర గాయాలు కాగా, వారిని సమీప ఆస్పత్రులకు తరలించారు. పోఖారా నుంచి ఖాట్మండుకు వెళ్తున్న ఈ బస్సు సోమవారం తెల్లవారుజామున ప్రమాదానికి గురైంది. ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 44 మంది పయాణికులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. సమాచారం అందుకున్న వెంటనే నేపాల్ 2లో

తిరుమల లడ్డూ వివాదంలో ఏపీ ప్రభుత్వానికి
సుప్రీంకోర్టులో ఊరట

ఏకసభ్య కమిషన్ విచారణకు గ్రీన్‌సిగ్నల్
సుబ్రహ్మణ్యస్వామి పిటిషన్‌ను కొట్టివేసిన ధర్మాసనం
సిట్,కమిషన్ విచారణలు వేర్వేరని స్పష్టం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23 (తరంగాలు ప్రతినిధి): తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడకం ఆరోపణల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో పెద్ద ఊరట లభించింది. ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ విచారణను కొనసాగించవచ్చని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. కమిషన్ నియామకాన్ని సవాలు చేస్తూ మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి దాఖలు చేసిన పిటిషన్‌ను 2లో

రఫేల్ ఒప్పందంలో అడ్డంకులు

సోర్స్ కోడ్‌లపై ఫ్రాన్స్ నిరాకరణ
స్వదేశీ అనుసంధానంపై ప్రభావం
మధ్యేమార్గంగా అనువర్తన అనుసంధానం 2లో

విధి ఒత్తిడిల్లోనూ ప్రతిభ
ప్రదర్శన ప్రశంసనీయం

- రాష్ట్ర స్థాయి క్రీడల్లో పతక విజేతలకు సత్కారం
- మరింత సాధనతో జాతీయ పతకాల లక్ష్యం
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్, ఫిబ్రవరి 23 (తరంగాలు ప్రతినిధి): రాబోయే రోజుల్లో మరింత శ్రమిస్తే జాతీయ స్థాయిలో కూడా పతకాలను సాధించగలమని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ పేర్కొన్నారు. సైబరాబాద్ కమిషనరేట్ వేదికగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి 2లో

కాంగ్రెస్ బలోపేతానికి
సమన్వయం అవసరం

- జిల్లా అధ్యక్షుల శిక్షణ శిబిరంలో దిశానిర్దేశం
- రాహుల్ గాంధీ ప్రధాని కావాలనే లక్ష్యం
- సామాజిక న్యాయమే కాంగ్రెస్ ధ్యేయం



2లో

పెళ్లి పేరుతో కొత్త తరహా మోసాలు

- నిశ్చితార్థం తర్వాత కూడా అప్రమత్తంగా ఉండాలి: పోలీస్ కమిషనర్ సజ్జనార్
- ఎమోషనల్ బ్లాక్‌మెయిల్, అదనపు కట్నం డిమాండ్లపై హెచ్చరిక
- షీ టీమ్స్‌కు ఫిర్యాదు చేయాలని సూచన

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (తరంగాలు ప్రతినిధి): పెళ్లి పేరుతో జరుగుతున్న కొత్త తరహా మోసాలు నగరంలో తీవ్ర కలకలం రేపుతున్నాయి. కేవలం ప్రేమ వ్యవహారాల్లోనే కాకుండా, పెద్దలు కుదిర్చిన సంబంధాల్లో కూడా యువతులు మోసపోతున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ హెచ్చరించారు. నిశ్చితార్థం జరిగిన తర్వాత కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మోసగాళ్లు తమ పంథాను మార్చుకున్నారని ఆయన తెలిపారు. 2లో

మెట్రో స్వాధీనం పై
కేబినెట్ సంచలన నిర్ణయం

ఎల్ అండ్ టీ నుంచి పూర్తి బాధ్యతల స్వీకరణకు ఆమోదం
పర్యవేక్షణకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలో ఉపసంఘం
రూ.2 వేల కోట్ల ఈక్విటీ చెల్లింపు,రూ.13 వేల కోట్ల రుణ బదలాయింపు

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (తరంగాలు ప్రతినిధి): హైదరాబాద్ మెట్రో రైలును ఎల్ అండ్ టీ సంస్థ నుంచి పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. మెట్రో ప్రాజెక్ట్‌ను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావాలన్న ప్రతిపాదనకు మంత్రివర్గం ఈరోజు అధికారిక ఆమోదం తెలిపింది. నగర ప్రజా రవాణా వ్యవస్థలో మెట్రో కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో, ఆర్థిక వర్గాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. మెట్రో స్వాధీన 2లో

తెలంగాణలో చిరుజల్లులు..
వేడి నుంచి ఉపశమనం

హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో వర్షం
నైరుతి బంగాళాఖాత ద్రోణి ప్రభావం
మరికొన్ని జిల్లాల్లో మోస్తరు వర్షాల సూచన

హైదరాబాద్, ఫిబ్రవరి 23 (తరంగాలు ప్రతినిధి): ఎండలు ముదురుతున్న వేళ హైదరాబాద్ సహా తెలంగాణలోని పలు ప్రాంతాల్లో చిరుజల్లులు కురిశాయి. మధ్యాహ్నం వరకు మండిన ఎండ తర్వాత ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై చల్లని వాతావరణం నెలకొంది. హైదరాబాద్‌లో ఖైరతాబాద్, ముషీరాబాద్, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, కాచిగూడ, కొండాపూర్, ఎల్బీనగర్, కూకట్‌పల్లి, ఉప్పల్, మాసాబ్ ట్యాంకు తదితర ప్రాంతాల్లో వర్షం పడింది. వర్షంతో ఉక్కపోత తగ్గి ప్రజలకు ఉపశమనం లభించింది. కరీంనగర్ ప్రాంతంలోనూ ఆకాశం మబ్బులతో కమ్ముకుని జల్లులు కురిశాయి. 2లో

కల్తీ పాల బాధిత కుటుంబాలకు
రూ.10 లక్షల పరిహారం

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన
ఆసుపత్రి ఖర్చులు ప్రభుత్వ భారం
డెయిరీ నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 23 (తరంగాలు ప్రతినిధి): రాజమహేంద్రవరంలోని చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్ ప్రాంతాల్లో కల్తీ పాలు వినియోగంతో మృతి చెందిన వారి కుటుంబాలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని వెల్లడించారు. కోరుకొండ మండలం నరసాపురం గ్రామంలోని వరలక్ష్మీ మిల్క్ డెయిరీ నుంచి 106 కుటుంబాలకు రోజూ పాల సరఫరా జరుగుతోందని అధికారులు తెలిపారు. ఆ డెయిరీ నుంచి వచ్చిన పాలను సేవించిన అనంతరం అనారోగ్యానికి గురైనట్లు నిర్ధారించారు. ఈ ఘటనలో నలుగురు మృతి చెందగా, ఇద్దరు వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. మరో ఎనిమిది మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. మృతుల్లో ముగ్గురు 70 ఏళ్లు దాటిన వారు కాగా, ఒకరు 58 ఏళ్ల వయసు వారు ఉన్నారు. బాధితుల నుంచి నమూనాలు సేకరించి హైదరాబాద్, విశాఖపట్నంలోని ప్రయోగశాలలకు పరీక్షల కోసం పంపించారు. ఘటనపై సమగ్ర విచారణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. డెయిరీ నిర్వాహకుడు అద్దాల గణేశ్వరరావును పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నారు. మృతుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కల్తీ పాల మరణాలపై జగన్ దిగ్భ్రాంతి

అమరావతి, ఫిబ్రవరి 23 (తరంగాలు ప్రతినిధి): రాజమహేంద్రవరంలో కల్తీ పాలు సేవించి ఐదుగురు మృతి చెందడం, మరికొందరు తీవ్ర అస్వస్థతకు గురవడం పట్ల మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన అత్యంత దురదృష్టకరమని పేర్కొంటూ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆహార భద్రత విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యం ప్రజల ప్రాణాలకే ముప్పు తెచ్చిందని జగన్ విమర్శించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై నిర్దాక్షిణ్యంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులకు అత్యుత్తమ వైద్యసేవలు అందేలా చూడాలని, వారి ఆరోగ్య పరిస్థితిపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు. అవసరమైతే ప్రత్యేక నిపుణుల బృందాలను నియమించి సమగ్ర వైద్యం అందించాలని సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ ఈ ఘటనపై అత్యవసరంగా దృష్టి సారించి బాధితులకు పూర్తి న్యాయం చేయాలని జగన్ స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యం విషయంలో రాజీ ఉండకూడదని పేర్కొన్నారు.

తెలంగాణ ఇంటర్
పరీక్షలకు సర్వం సిద్ధం

ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు పరీక్షలు
9,97,075 మంది విద్యార్థులు హాజరు
30 వేల సీసీ కెమెరాల నిఘాలో నిర్వహణ

2లో

THARANGALU DAILY NEWS
మంగళవారం, 24 ఫిబ్రవరి,2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

నేపాల్‌లో ఘోర బస్సు ప్రమాదం

మొదటి పేజీ తరువాయి పోలీసులు, సైన్యం, సాయుధ బలగాలు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించాయి. బస్సు లోతైన లోయలో పడిపోవడం, చీకటి పరిస్థితులు ఉండటంతో రక్షణ చర్యలు క్లిష్టంగా మారాయి.మరణించిన వారిలో ఆరుగురు మహిళలు, 12 మంది పురుషులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. వారిలో ఒక మహిళ, ఒక పురుషుడు న్యూజిలాండ్ దేశానికి చెందిన పర్యాటకులుగా గుర్తించారు. గాయపడిన వారిలో కూడా పలువురు విదేశీ పర్యాటకులు ఉన్నట్లు సమాచారం. తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం ఖాట్మండు ఆస్పత్రులకు తరలించారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు తెలియాల్సి ఉంది. అయితే అతివేగమే ఈ దుర్ఘటనకు కారణమై ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.

రఫేల్ ఒప్పందంలో అడ్డంకులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23 (తరంగాలు ప్రతినిధి): భారత్‌కు 114 రఫేల్ యుద్ధ విమానాల విక్రయం నేపథ్యంలో జరుగుతున్న చర్చల్లో కీలక సాంకేతిక అంశాలు ప్రధానంగా మారాయి. స్పెక్ట్రా ఎలక్ట్రానిక్ యుద్ధ వ్యవస్థతో పాటు ఇతర కీలక ఎలక్ట్రానిక్ వ్యవస్థల కోసం అవసరమైన మూల సంకేతాలను బదిలీ చేయడాన్ని ఫ్రాన్స్ ప్రభుత్వం తిరస్కరించినట్లు సమాచారం. దీంతో ఫ్రాన్స్ అనుమతి లేకుండా భారత్ స్వతంత్రంగా కొన్ని సెన్సార్లు, ఆయుధాలను అనుసంధానం చేయడం లేదా విమాన నిర్వహణ వ్యవస్థలను పూర్తి స్థాయిలో వినియోగించడం కష్టమయ్యే పరిస్థితి ఏర్పడే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మూల సంకేతాలు అందుబాటులో లేకపోవడం వల్ల స్వదేశీ ఆయుధ వ్యవస్థలను వేగంగా అనుసంధానం చేయడం సాధ్యంకాలేదని, సమాచార అనుసంధాన సామర్థ్యాన్ని మెరుగుపరచలేకపోయిందని అమెరికా వైమానిక దళానికి చెందిన మాజీ ఉన్నతాధికారి డేవిడ్ డెప్టులా ఒక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. గతంలో జరిగిన సైనిక ఘర్షణ సమయంలో ఒక రఫేల్ విమానం నష్టపోవడానికి సాంకేతిక పరిమితులు కారణమై ఉండవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే పాకిస్థాన్‌తో జరిగిన ఘర్షణలో రఫేల్ విమానం నష్టాన్ని భారత్ అధికారికంగా అంగీకరించలేదు. 2025 జూలై 8న ఒక వ్యాపార వార్తా వాహినికి ఇచ్చిన ఇంటర్వ్యూలో భారత రక్షణ కార్యదర్శి ఆర్‌కే సింగ్ స్పందిస్తూ రఫేల్ విమానాల గురించి బహువచనంలో మాట్లాడటం సరైంది కాదని తెలిపారు. ఈ వ్యాఖ్యలను విశ్లేషకులు ఒక విమానం నష్టం జరిగి ఉండొచ్చనే సంకేతంగా పరిగణిస్తున్నారు. మరోవైపు మూల సంకేతాలను యాజమాన్య ఉత్పత్తులుగా పరిగణిస్తూ, వాటిని ఇతర దేశాలతో పంచుకోలేమని ఫ్రాన్స్ స్పష్టం చేసినట్లు సమాచారం.ఇలాంటి పరిస్థితుల్లో పూర్తి మూల సంకేతాల బదిలీకి బదులుగా అనువర్తన అనుసంధాన మార్గాన్ని పరిశీలించే అవకాశం ఉందని కొన్ని వర్గాలు పేర్కొంటున్నాయి. దీనిలో భాగంగా పూర్తి మూల సంకేతాల స్థానంలో అనువర్తన అనుసంధాన విధానాన్ని అందించే అవకాశముంది. దీని ద్వారా యాజమాన్య హక్కులు కాపాడుకుంటూనే భారత్ తన స్వదేశీ వ్యవస్థలను అనుసంధానం చేసుకునే వీలుంటుందని భావిస్తున్నారు. ఇదే విధానాన్ని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఇప్పటికే అనుసరిస్తున్న దేశంగా గుర్తిస్తున్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి సమన్వయం అవసరం

వికారాబాద్, ఫిబ్రవరి 23 (తరంగాలు ప్రతినిధి): వికారాబాద్‌లో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల శిక్షణ శిబిరంలో పాల్గొని పార్టీ బలోపేతంపై దిశానిర్దేశం చేసినట్లు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఇరు రాష్ట్రాల నాయకులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పనిచేస్తేనే పార్టీ మరింత బలపడుతుందని సూచించారు. దేశంలోని సామాజిక, ఆర్థిక సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించాలంటే రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేసే లక్ష్యంతో జిల్లా అధ్యక్షులు కట్టుదిట్టమైన ప్రణాళికతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజలతో నిత్యం మమేకమై వారి సమస్యలను ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ కేవలం రాజకీయ వేదిక మాత్రమే కాదని, అంటరానితనం మరియు కుల వివక్ష నిర్మూలనకు పోరాడిన సామాజిక సంస్కరణల ఉద్యమమని భట్టి విక్రమార్క అన్నారు. వైకాం, చౌదర్ సత్యాగ్రహాల నుండి నేటి వరకు సామాజిక సమానత్వం కోసం కాంగ్రెస్ నిరంతరం శ్రమిస్తోందని తెలిపారు. రోహిత్ వేముల ఘటన సమయంలో రాహుల్ గాంధీ స్పందించిన తీరు ఆయనలోని సామాజిక స్పృహకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. రాజ్యాంగంలోని అధికరణ 17, ఎస్సీ, ఎస్టీ అఘాయిత్య నిరోధక చట్టం, భూ సంస్కరణలు, ఉప ప్రణాళిక వంటి చారిత్రాత్మక నిర్ణయాలు కాంగ్రెస్ పాలనలోనే సాధ్యమయ్యాయని గుర్తుచేశారు. రాజ్యాంగ విలువలను కాపాడటం, సామాజిక న్యాయం అందించడమే పార్టీ లక్ష్యమని, ప్రతి కార్యకర్త పునరంకితం కావాలని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.

తిరుమల లడ్డూ వివాదంలో ఏపీ ప్రభుత్వానికి

సుప్రీంకోర్టులో ఊరట

మొదటి పేజీ తరువాయి ధ ర్మా స నం కొట్టివేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం పిటిషన్‌పై విచారణ చేపట్టింది. ఇప్పటికే సుప్రీంకోర్టు ఆదేశాలతో సీబీఐ ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ జరుపుతుండగా, రాష్ట్ర ప్రభుత్వం సమాంతరంగా మరో కమిటీని ఏర్పాటు చేయడం సరైందా అనే అంశాన్ని పిటిషనర్ ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు సీఎం చంద్రబాబు, టీటీడీ, సీబీఐని ప్రతివాదులుగా చేర్చారు.పిటిషనర్ వాదనలను తోసిపుచ్చిన ధర్మాసనం, ఒక దర్యాప్తు సంస్థ విచారణ మరో కమిటీపై ప్రభావం చూపదని స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిటీ పరిపాలనాపరమైన లోపాలను గుర్తించేందుకు ఏర్పాటైందని, ఇది సీబీఐ దర్యాప్తును ప్రభావితం చేయదని పేర్కొంది. రెండు విచారణలు వేర్వేరు పరిధుల్లో సాగుతాయని, ఒకదానితో మరొకటి ముడిపడలేదని తేల్చి చెప్పింది. ఇప్పటికే ప్రత్యేక దర్యాప్తు బృందం తన నివేదికలో నెయ్యి కొనుగోలు టెండర్లు, నిబంధనల సడలింపుల్లో లోపాలు ఉన్నట్లు ప్రభుత్వానికి తెలియజేసింది. దీనిపై చర్యల సిఫార్సుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దినేశ్‌కుమార్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసింది. 45 రోజుల్లో నివేదిక సమర్పించాలని ఆదేశించింది. తాజాగా సుప్రీంకోర్టు అనుమతితో కమిషన్ విచారణ ముందుకు సాగనుంది.

విధి ఒత్తిడిల్లోనూ ప్రతిభ

ప్రదర్శన ప్రశంసనీయం

మొదటి పేజీ తరువాయి పోలీస్ క్రీడల్లో పతకాలను సాధించిన వరంగల్ కమిషనరేట్ క్రీడాకారులకు సోమవారం కమిషనరేట్ కార్యాలయంలో అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సన్‌ప్రీత్ సింగ్ ముందుగా పతకాలను గెలుచుకున్న క్రీడాకారులను వ్యక్తిగతంగా కలిసి అభినందించారు. హాకీ క్రీడాకారులు సంయుక్తంగా కమిషనర్‌కు హాకీ జెర్సీని బహూకరించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో టేబుల్ టెన్నిస్ విభాగంలో కాంస్య పతకం సాధించిన కమిషనర్‌కు ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్ పతకాన్ని అందజేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎన్ని ఒత్తిడులు ఉన్నా క్రీడల్లో ప్రతిభ చూపించి పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి ఎక్కువ సంఖ్యలో పతకాలు కైవసం చేసుకోవడం సంతోషకరమని తెలిపారు. ఇదే ఉత్సాహంతో ముందుకు సాగి జాతీయ స్థాయి పోటీల్లో కూడా మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. క్రీడల్లో రాణించే వారికి శాఖ తరఫున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిసిపిలు దార కవిత, అంకిత్ కుమార్, శిక్షణాధికారి మనిషా నేహ్రా, అదనపు డిసిపిలు సురేష్ కుమార్, రవి, శ్రీనివాస్, ఏసిపిలు నాగయ్య, సురేంద్ర, జితేందర్ రెడ్డి, మధుసూదన్, అంతయ్య తదితరులు పాల్గొన్నారు. పోలీస్ సిబ్బంది క్రీడాస్ఫూర్తిని మరింత పెంపొందించుకోవాలని కమిషనర్ పిలుపునిచ్చారు.

కేబినెట్ సంచలన నిర్ణయం

మొదటి పేజీ తరువాయి

ప్రక్రియను సమర్థంగా అమలు చేయడానికి మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశారు. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రులు శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్, జూపల్లి కృష్ణారావులను సభ్యులుగా నియమించారు. ఈ ఉపసంఘం ఆర్థిక, న్యాయ, పరిపాలనా అంశాలను పరిశీలిస్తూ స్వాధీన ప్రక్రియను పర్యవేక్షించనుంది.గత సంవత్సరం జరిగిన సూత్రప్రాయ ఒప్పందం ప్రకారం ఎల్ అండ్ టీకి రూ.2 వేల కోట్ల ఈక్విటీని ఏకమొత్తంగా

చెల్లించడంతో పాటు, సుమారు రూ.13 వేల కోట్ల రుణాలను ప్రభుత్వం బదలాయించుకోవాలని అవగాహనకు వచ్చినట్లు సమాచారం. ఈ ప్రక్రియ అప్పటినుంచి దశలవారీగా కొనసాగుతోంది. మెట్రో ఆర్థిక వ్యవస్థను పునర్వ్యవస్థీకరించి, సేవలను మరింత సమర్థంగా నిర్వహించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందడుగు వేసినట్లు అధికారులు పేర్కొన్నారు. హైదరాబాద్ నగర రవాణా రంగంలో దీర్ఘకాలిక ప్రణాళికల అమలు, విస్తరణ ప్రాజెక్టుల వేగవంతం, ప్రయాణికులకు మెరుగైన సదుపాయాల కల్పన లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వర్గాలు వెల్లడించాయి. మెట్రో స్వాధీనం అనంతరం సేవల నాణ్యత, నిర్వహణలో పారదర్శకత పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

ఇల్లందులో భూ సమస్యల పరిష్కారానికి

శాంతియుత దీక్షలు

ఇల్లందు ప్రతినిధి, ఫిబ్రవరి 23,(తరంగాలు): ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారం కోసం తుడుం దెబ్బ ఆధ్వర్యంలో. ఇల్లందు తాసిల్దార్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు తుడుం దెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోగ్గేల రామస్వామి ఓ ప్రకటనలో తెలిపారు.

తెలంగాణలో చిరుజల్లులు..

వేడి నుంచి ఉపశమనం

మొదటి పేజీ తరువాయి

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావం వల్ల ఈ వర్షాలు కురుస్తున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. వాతావరణంలో ఆకస్మిక మార్పులు చోటుచేసుకున్నాయని అధికారులు తెలిపారు. నిజామాబాద్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో కూడా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించింది. యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, నిజామాబాద్, సిరిసిల్ల, జగిత్యాల, మెదక్, సిద్దిపేట, వికారాబాద్, కామారెడ్డి, మంచిర్యాల జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు

పెళ్లి పేరుతో కొత్త తరహా మోసాలు

ముందుగా సంప్రదాయబద్ధంగా పెళ్లి చూపులు, నిశ్చితార్థం జరిపించుకుని విశ్వాసం పొందుతున్నారని చెప్పారు. ఆ తర్వాత పెళ్లి ఖాయమైందన్న చనువును ఆసరాగా చేసుకుని యువతులతో సన్నిహితంగా మెలిగి, మాయమాటలతో ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేస్తూ శారీరకంగా లోబరుచుకునే ఘటనలు నమోదవుతున్నాయని వెల్లడించారు. పెళ్లి సమయం దగ్గర పడిన తర్వాత అదనపు కట్నం కోరుతూ, ఇవ్వకపోతే పెళ్లి రద్దు చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. సమాజంలో పరువు పోతుందనే భయంతో చాలా మంది బాధితులు ఫిర్యాదు చేయడానికి వెనుకాడుతున్నారని, ఈ మౌనాన్ని ఆసరాగా చేసుకుని మోసగాళ్లు మరింతగా రెచ్చిపోతున్నారని షీ టీమ్స్ గుర్తించాయని చెప్పారు. నిశ్చితార్థం జరిగినంత మాత్రాన గుడ్డిగా నమ్మకుండా, అబ్బాయి ప్రవర్తన, స్నేహితులు, అలవాట్లపై ముందుగానే ఆరా తీయాలని సూచించారు. ముఖ్యంగా పెళ్లికి ముందే శారీరక సంబంధం కోసం ఒత్తిడి చేస్తే అది ప్రమాద సంకేతమని స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనలకు గురైన వారు భయపడకుండా ముందుకు రావాలని, బాధితుల వివరాలను గోప్యంగా ఉంచుతామని కమిషనర్ భరోసానిచ్చారు. ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే షీ టీమ్స్ వాట్సాప్ నంబర్ 9490616555 కు లేదా అత్యవసరంగా 100 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

ఇల్లందు మున్సిపల్ చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపిన

కాంగ్రెస్ మహిళ శ్రేణులు

ఇల్లందు ప్రతినిధి, ఫిబ్రవరి 23,(తరంగాలు):ఇల్లందు మున్సిపల్ చైర్మన్ గా దొడ్డ కిరణ్ మిత్ర-డానియల్ దంపతుల ఇరువురికి శుభాకాంక్షలు తెలిపి దండలతో సన్మానించిన కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు కల్తి పద్మ, టౌన్ మహిళా నాయకురాలు తదితరులు.

తెలంగాణ ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

హైదరాబాద్, ఫిబ్రవరి 23(తరంగాలు ప్రతినిధి): తెలంగాణ ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు సర్వం సిద్ధమైంది. ఈ నెల 25 నుంచి మార్చి 18 వరకు జరగనున్న పరీక్షల నిర్వహణపై ఇంటర్ బోర్డు కార్యదర్శి, ఐఏఎస్ అధికారి కృష్ణాదిత్య కీలక వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది మొత్తం 9,97,075 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతుండగా, మొదటి సంవత్సరం నుంచి 4,89,126 మంది, ద్వితీయ సంవత్సరం నుంచి 5,07,949 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,495 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో 404 ప్రభుత్వ కళాశాలలు, 221 ఎయిడెడ్ కళాశాలలు, 863 ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, 7 ఇతర విద్యాసంస్థలను ఎంపిక చేశారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ప్రైవేట్ కళాశాలలు అధికంగా ఉండగా, మిగతా జిల్లాల్లో ప్రభుత్వ కళాశాలలకు ప్రాధాన్యత ఇచ్చారు. మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా దాదాపు 30 వేల సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి కేంద్రంపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందని, విద్యార్థులు పరీక్షా కేంద్రానికి అరగంట ముందే చేరుకోవాలని సూచించారు. ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చినా అనుమతిస్తామని, అయితే సమయపాలన పాటించాలని విజ్ఞప్తి చేశారు. మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యార్థులను బయటకు పంపబోమని, ప్రశ్నాపత్రాలు కూడా బయటకు వెళ్లకుండా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. హాల్ టికెట్ల వివాదాలపై స్పందిస్తూ, ఫీజులు చెల్లించలేదనే కారణంతో ఎవరినీ ఇబ్బంది పెట్టబోమని తెలిపారు. కోర్టును ఆశ్రయించిన విద్యార్థులకు కూడా హాల్ టికెట్లు జారీ చేశామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 28,500 మంది ఇన్విజిలేటర్లు విధుల్లో ఉంటారని, విద్యుత్, రవాణా, పోలీస్ శాఖల సమన్వయంతో అన్ని మౌలిక వసతులు కల్పించినట్లు కృష్ణాదిత్య వెల్లడించారు.

నోటీసులిస్తే భయపడాలా..?

అధికారులకు సవాల్ విసురుతున్న బట్టీ నిర్వాహకులు..
'మామూలు'గా వదిలేస్తున్న అధికారులు
ఇష్టారాజ్యంగా విద్యుత్ వాడకం..
అయినా పట్టించుకోని విద్యుత్ శాఖ
అక్రమంగా కలప వినియోగం..
చూసీచూడనట్లు అటవీశాఖాధికారులు
అన్నీ తెలిసినా పట్టించుకోని రెవెన్యూశాఖ
మూడుపువ్వులు..ఆరుకాయలుగా అమ్యామ్యాల పరంపర..?

పాలేరు ఆర్సీ, 23ఫిబ్రవరి (తరంగాలు) :కూసుమంచి మండలంలో నిర్వహించబడుతున్న ఇటుక బట్టీలపై పత్రికలలో వరుసకథనాలు వెలువడుతున్నా సంబంధిత అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి కూడా చూడకుండా ఉండడం పలు అనుమానాలకు తావిస్తుంది. బట్టీలలో మండలవ్యాప్తంగా సుమారు 30నుంచి 40మంది చిన్నపిల్లలు చదువు, సంధ్యలేకుండా బూడిదలో బూడిదై, మట్టి దిబ్బలపాలై అనారోగ్యం పాలవుతుంటే కనీసం పంచాయతీ కార్యదర్శులు కానీ, జీపీవోలు కానీ, రెవెన్యూ, మైనింగ్, శిశు సంక్షేమ శాఖ ఏ శాఖకు సంబంధించిన అధికారులుకూడా కన్నెత్తి చూడకపోవడంవెనుక భారీ ఎత్తున ముడుపులు ముట్టాయనే అనుమానాలు కలగక మానడంలేదు. సంబంధిత అధికారులు ఏదైనా వ్యాపారం చేయాలంటే అన్ని పత్రాలు సరిగా ఉన్నాయోలేవో సరిచూసి ప్రభుత్వ ఆదాయాన్ని పెంచేలా చూడాల్సింది పోయి తమ జేబులు నిండితే చాలు అన్నచందంగా వ్యవహరించడం ఏంటని మండలప్రజలు చర్చించుకుంటున్నారు.

ఇష్టారాజ్యంగా కలప వినయోగం..

బట్టీలలో ఇటుక కాల్చేందుకు టన్నులకొద్ది కలప అవసరం. అలాంటి కలప ట్రాక్టర్ల కొద్ది లోడ్లు అక్రమంగా తరలిస్తుంటే సంబంధింత అధికారులు కనీసం బట్టీలవైపు కన్నెత్తి చూడకపోవడం వెనుక రహస్యం అర్థంకాని ప్రశ్న. ఇదంతా ముందస్తుగా ముడుపులు ముట్టినాయి కాబట్టే అధికారులు అటువైపు కన్నెత్తి చూడడంలేదనేది తేటతెల్లం అవుతుంది. ఇటుక కలప లేనిదే కాలవనేది అక్షరసత్యం. మరి అలాంటప్పుడు కలప ఎక్కడనుంచి వస్తుంది, ఎప్పుడు వస్తుంది అనేది నిఘాపెట్టి పట్లుకోవాల్సిన అధికారులే వదిలేస్తుంటే వ్యాపారస్తులు కూడా మామూలుగా తీసుకుని అధికారులను ప్రసన్నం చేసుకుంటున్నారు.

ఇష్టారాజ్యంగా విద్యుత్ వినియోగం..

బట్టీల నిర్వహణ పూర్తిగా వ్యాపారమయం. కానీ ఇక్కడ వినియోగిస్తున్న విద్యుత్ వాడకంపై నేటికి సంబంధిత అధికారులు తేల్చకపోవడం విడ్డూరం. రాత్రి పూట ఇష్టారాజ్యంగా వాడుతూ, ఉదయంపూట వేరే రంకంగా ఉంటూ ప్రభుత్వ అధికారులను బురిడీ కొట్టిస్తున్నారు. అయినా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

తూతూమంత్రంలా చర్యలు..

వ్యాపారం చేస్తున్న భూములకు నాలా అనుమతులు లేకుండా, మట్టి వినియోగానికి మైనింగ్ అధికారుల అనుమతులు లేకుండా, వాడుతున్న విద్యుత్ కు సరైన అనుమతులు లేకుండా, బట్టీలలో కాల్చే కలప వాడకానికి అటవీశాఖ అనుమతులు లేకుండా, బట్టీలు కాల్చేందుకు పర్యావరణ శాఖ అనుమతులు లేకుండా, బట్టీలలో పనిచేసే కార్మికులకు కార్మికశాఖ అనుమతులు లేకుండా, ఇవిఅన్నీ చూపిస్తేనే పూర్తి స్థాయిలో పంచాయతీ నుంచి అనుమతి తీసుకుని బట్టీలనిర్వహణకు సహకరించాల్సిన గ్రామపంచాయతీ అనుమతులు లేకుండా యథేచ్ఛగా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండికొట్టి కోట్లుసంపాదిస్తుంటే రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుని చోద్యం చూడడం వెనుక ఆంతర్యం అర్థంకాని ప్రశ్న..

765కె.వి హైటెన్షన్ వైర్ల బాధిత రైతులను ఆదుకోవాలి

సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి

కల్వకుర్తి,ఫిబ్రవరి 23, తరంగాలు ప్రతినిధి: రైతుల పొలాల గుండా 765 కె.వి హైటెన్షన్ విద్యుత్ స్తంభాలు,తీగలు వేయడంతోరైతులు తీవ్రంగానష్టపోతున్నారని లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి అన్నారు. కడ్తాల్ మండలం, పలు గ్రామాల మీదుగా 765 ఏ.వి. బీదర్ – మహేశ్వరం నూతన విద్యుత్ లైన్ ఏర్పాటుతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. హైటెన్షన్ విద్యుత్ తీగల ఏర్పాటుతో నష్టపోతున్న రైతులకు న్యాయం చేయాలని సోమవారం రైతులతో కలిసి కందుకూరు రెవెన్యూ డివిజనల్ అధికారి జగదీశ్వర్ రెడ్డికి కందుకూరు ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైటెన్షన్ విద్యుత్ లైన్ల ఏర్పాటుతో వ్యవసాయ భూముల వినియోగాన్ని ప్రభావితం చేస్తుందని, పంట ఉత్పత్తిపై కూడా ప్రభావం చూపుతుందని అన్నారు. కడ్తాల్ గ్రామం శరవేగంగా అభివృద్ధి చెందుతుండడంతో గ్రామానికి సమీపాన విద్యుత్ లైన్ ఏర్పాటుతో అభివృద్ధి ఆగిపోతుందని తెలిపారు. ఈ మేరకు రైతులకు న్యాయం చేసే విధంగా పై అధికారులకు నివేదిస్తానని ఆర్డీవో సానుకూలంగాస్పందించినట్లు తెలిపారు. హైటెన్షన్ విద్యుత్ లైన్ల ఏర్పాటుతో రైతులు తమ పొలాలను వ్యవసాయానికి వినియోగించుకోకపోగా, క్రయవిక్రయాలకు కూడా వీలు లేకుండా తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హై టెన్షన్ స్తంభాలు మరియు విద్యుత్ తీగల ఏర్పాటుతో నష్టపోతున్న రైతులకు న్యాయం జరిగేంతవరకు రైతుల పక్షానపోరాడతామని, రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కడ్తాల్ మాజీ ఉప సర్పంచ్ కడారి రామకృష్ణ ,వార్డు సభ్యులు ఎర్రోళ్ల రాఘవేందర్,బీసీ సంఘం కడ్తాల్ అధ్యక్షుడు పిప్పల్ల వెంకటేష్, గుదే రాములు యాదవ్,గూడూరు శేఖర్ రెడ్డి,గూడూరు పెంటారెడ్డి,క్యాతిక కేశవులు, కందికంటి శ్రీరాములు, గుదే పర్వత్ కుమార్ యాదవ్, గోరేటి శ్రీశైలం,గోరేటి చంద్రశేఖర్,జంగయ్య,యాదయ్య,కేశవులు,సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గట్టుసింగారంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

పాలేరు ఆర్సీ,23ఫిబ్రవరి (తరంగాలు): కూసుమంచి మండలంలోని గట్టుసింగారం గ్రామంలో పారిశుధ్య పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ పనులను సర్పంచ్ మేడేపల్లి విజయ, ఉపసర్పంచ్ శీలం జానయ్య, పంచాయతీ కార్యదర్శి సాలె ఉపేందర్ లు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఉపసర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని డ్రైనేజీలలో పేరుకుపోయిన పూడికను పూర్తిగా తొలగిస్తున్నామని తెలిపారు. సోమవారం గ్రామంలోని పలు వార్డులలో పనులు కొనసాగినట్లు వారు తెలిపారు. ఇటీవల కాలంలో సర్పంచ్ ఎన్నికలు ముగియడంతో నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు గ్రామంలో సమస్యలు గుర్తిస్తూ ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నారు. అందులో భాగంగానే గట్టుసింగారంలో కూడా పారిశుధ్య పనులు ప్రారంభించినట్లు వారుతెలిపారు. డ్రైనేజీలలో పూడికతో పాటు రహదారులవెంట పెరిగిన కంపచెట్లు, వాటర్ ట్యాంకులవద్ద పెరిగిని పిచ్చిమొక్కలు, అంతర్గత రహదారులవెంట చెత్తాచెదారం తొలగిస్తున్నట్లు తెలిపారు.

మహిళా సంఘం భవన నిర్మాణానికి భూమి పూజ చేసిన

సర్పంచ్ అన్నం స్వప్న బ్రహ్మారెడ్డి

జఫర్గడ్ ప్రతినిధి, ఫిబ్రవరి 23,(తరంగాలు): మండల కేంద్రం లోని తమ్మడపల్లి జి గ్రామంలో సోమవారం రోజున భద్రఖాళీ గ్రామైక్య సంఘం విఓ బిల్డింగ్ నిర్మాణం కోసం భూమిపూజ చేసిన గ్రామ స్థానిక సర్పంచ్,గ్రామాభిరుద్ది కమిటీ చైర్మెన్ అన్నం స్వప్న బ్రహ్మరెడ్డి.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు ఏపీఎం, సీసీ,సిఏ, పంచాయతీ కార్యదర్శి హరీష్,జి పిఓ,పిఆర్ ఈ వర్కిన్స్పెక్టర్ ,ఉప సర్పంచ్ గంగరాజు,నూతన పాలకమండలి వార్డ్ మెబార్స్ మాజీ సర్పంచులు అన్నెపు పద్మా అశోక్, గుజ్జరీ రాజు, చిట్టిమేళ్ల కృష్ణమూర్తి, మారేపల్లి స్వప్న ప్రభాకర్, గ్రామశాఖ అధ్యక్షులు ఎండీ అజ్మీయ, గ్రామ సీనియర్ నాయకులు దాసరి ఎల్లయ్య, గుండెబోయిన రాజు,రంగు సారయ్య,లొకిని సాయిలు,మారేపల్లి రవి,నరేందర్ రెడ్డి, బాషా, మందపురి నవీన్,గుండా సుదర్శన్, తదితర నాయకులు, గ్రామస్థులు, మహిళా సంఘం అధ్యక్షులు అందరు పాల్గొని కార్యక్రమాన్ని విజేయవంతం చేయడం జరిగింది.

ఉర్దూ ఘర్ షాదీఖాన అభివృద్ధికి కృషి చేస్తా

కల్వకుర్తి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్.

కల్వకుర్తి, ఫిబ్రవరి 23, తరంగాలు ప్రతినిధి: కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఉర్దూ ఘర్ షాదీఖానను అన్ని రకాల సౌకర్యాలు వసతులతో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని మున్సిపాలిటీ వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్ తెలిపారు.సోమవారం ఉర్దూ ఘర్ షాదీఖానను మున్సిపాలిటీ వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్ స్థానిక ముస్లిం మైనార్టీ కౌన్సిలర్లు నాజియా మక్బూల్,షేక్ ఏజాస్, మున్సిపాలిటీ ఏ.ఈ. షబ్బీర్ అహ్మద్,లతో కలిసి సందర్శించారు.ఈసందర్భంగా మున్సిపాలిటీ వైస్ చైర్మన్ షానవాజ్ ఖాన్ ఉర్దూ ఘర్ షాదీఖానలో చేపట్టవలసిన అభివృద్ధి పనులను మున్సిపాలిటీ ఏ.ఈ. షబ్బీర్ అహ్మద్ కు వివరించారు.ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు మంజూర్అలీ, అఖిల్,ఉస్మాన్,హిమాయత్,తదితరులు పాల్గొన్నారు.

పదవ తరగతి పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి,ఫిబ్రవరి.23, తరంగాలు: సోమవారం ఐడిఓసి కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్,10 వ తరగతి పరీక్షలు నిర్వహణపై విద్యాశాఖ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్, వైద్య, సమాచార, పంచాయతి రాజ్, రవాణా, విద్యుత్తు, ఆర్టీసీ, ట్రెజరి, పోస్టల్, మున్సిపల్ అధికారులతోసమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 2026లో పరీక్షలు నిర్వహణకు తెలంగాణ ప్రభుత్వ పరీక్షల నియంత్రణాధికారి, హైదరాబాద్ జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం ఎస్ఎస్సి పబ్లిక్ పరీక్షలు 14-03-2026 నుండి 16-04-2026 వరకు ఉదయం 9.30 నుండి 12.30 గంటల వరకు జరుగనున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో పరీక్షల నిర్వహణలో ఎటువంటి అంతరాయం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని స్పష్టం చేశారు.పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా మరియు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా నిర్వహించేందుకు అవసరమైన భద్రతా చర్యలు, రవాణా సౌకర్యాలు, వైద్య సదుపాయాలు, విద్యుత్ సరఫరా, ప్రశ్నాపత్రాల రవాణా మరియు భద్రత తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలీస్ బందోబస్తు మధ్య ప్రశ్న, జవాబు పత్రాలు తరలించాలని సూచించారు. జిల్లాలో 45 కేంద్రాల్లో (8157) మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు అవుతున్నట్లు తెలిపారు. పర్యవేక్షణకు ఫ్లైయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ కేంద్రాలు మూసి వేయాలని,144 సెక్షన్ అమలు చేయాలని తెలిపారు.పరీక్షా కేంద్రాల్లో అత్యవసర సేవలకు వైద్య కేంద్రాలు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని, అలాగే 108 వాహనాలు, ప్రధాన ఆసుపత్రిలో అత్యవసర వార్డులు సిద్ధంగా ఉంచాలని సూచించారు.విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవడానికి అనువుగా అదనపు బస్సులు నడపాలని తెలిపారు.అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో పారిశుద్య కార్యక్రమాలు నిర్వహించి పరిశుభ్రం చేయాలని పంచాయతి, మున్సిపల్ అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో,మహబూబాబాద్, తొర్రూరు రెవెన్యూ డివిజనల్ అధికారులు క్రిష్ణవేణి, గణేష్, డీఈవో రాజేశ్వర్, డీఎస్పీ తిరుపతిరావు, మున్సిపల్ కమిషనర్లు, విద్యుత్, ఆర్టీసీ, పోస్టల్ తదితర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

THARANGALU DAILY NEWS
మంగళవారం, 24 ఫిబ్రవరి,2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

ముస్సిపాలిటీ అభివృద్ధే ధ్వేయంగా పనిచేయాలి

మహబూబాబాద్ మున్సిపాలిటీ నూతన పాలక వర్గానికి ఎమ్మెల్యే మురళి నాయక్ సన్మానం

మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, ఫిబ్రవరి. 23,తరంగాలు : మహబూబాబాద్ మున్సిపాలిటీ లో గెలిచిన కౌన్సిలర్ లకు స్థానిక మహబూబాబాద్ పట్టణ కేంద్రంలో ఉన్న పిఎస్ఆర్ ఫంక్షన్ హాల్ నందు సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మురళి నాయక్,ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా"భూక్యా మురళి నాయక్ మాట్లాడుతూ మహబూబాబాద్ మున్సిపాలిటీ ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్న అంతేకాకుండా తెలంగాణ లో ఎక్కడ లేని విధంగా మన మానుకోట మున్సిపాలిటీ అభివృద్ధికి 70 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసిన ముఖ్య మంత్రి రేవంత రెడ్డి మరియు ప్రభుత్వ సలహా దారుడు వేం నరేందర్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు ... ఎన్నికల వేళ పార్టీలు కానీ ఎన్నికల తర్వాత పార్టీల కు అతీతంగా మున్సిపాలిటీ అభివృద్ధిలో బాగా స్వాములు కావాలని కోరారు. ఎన్నిరోజులు మున్సిపాలిటీలో ఎలా ఉందో అనే విషయం పక్కన పెడితే ఇప్పుడు మాత్రం మానుకోట మున్సిపాలిటీ తెలంగాణలో ఒక మంచి మున్సిపాలిటీగా పేరు రావాలని అదే విధంగా అభివృద్ధిలో కూడా ముందు ఉండాలని దీనికి ప్రతియొక్క కౌన్సిలర్ లు బాధ్యత యుతంగా పనిచేయాలని అంతేకాకుండా ప్రజా సమస్యలు తమ సమస్యలుగా భావించి ప్రజా అవసరాల దృష్ట పని చేయాలని ఎవరైనా వార్డులో పరిశుద్యం పై నిర్లక్ష్యం వహించకుండా కాలనీలలో తిరగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట మహబూబాబాద్ మున్సిపాలిటీ చైర్మన్ గూగులోత్ జ్యోతి రమేష్,వైస్ చైర్మన్ సూర్నపు సోమయ్య 36 వార్డుల కౌన్సిలర్లు ,మున్సిపల్ శాఖ అధికారులు,పట్టణ నాయకులు కార్యకర్తలు,పాల్గొన్నారు..

అంగన్వాడి సెంటర్ నుండి కోడిగుడ్లు పాల ప్యాకెట్లు తరలింపు

తొర్రూర్,ఫిబ్రవరి 23, తరంగాలు: మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం పరిధిలోని చెర్లపాలెం గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో వెలుగుచూసిన ఘటన స్థానికంగా తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించింది. గ్రామంలోని అంగన్వాడీ సెంటర్--3కు ప్రభుత్వం నుంచి సరఫరా చేయబడిన కోడిగుడ్లు, పాల ప్యాకెట్లు చిన్నారులు, గర్భిణీ స్త్రీలు, బాలింతలకు పంపిణీ చేయాల్సి ఉండగా అవి పట్టణాలకు తరలిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అనుమానాస్పదంగా ఆటోలో సరుకులు లోడ్ చేసి తీసుకెళ్తున్న దృశ్యాలను గమనించిన కొంతమంది స్థానికులు వాహనాన్ని అడ్డుకుని తనిఖీ చేయగా, అంగన్వాడీకి కేటాయించిన గుడ్లు, పాల ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించినట్టు తెలిపారు. దీంతో ఆగ్రహానికి గురైన స్థానికులు ఇది ఒక్కరోజు ఘటన కాదని, గతంలో కూడా ఇలాంటి తరలింపులు జరిగిన ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పథకాల

ద్వారా అందించే పోషకాహారం లక్షిత లబ్ధిదారులకు చేరకుండా మళ్లింపులు జరగడం అత్యంత ఆందోళనకరమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. చిన్నారుల పోషణ, గర్భిణీల ఆరోగ్య పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన అంగన్వాడీ వ్యవస్థలో ఇలాంటి అక్రమాలు చోటుచేసుకోవడం పథకాల అమలుపై ప్రశ్నలు రేకెత్తిస్తోందని వారు పేర్కొన్నారు. వెంటనే సంబంధిత శాఖ అధికారులు దర్యాప్తు జరిపి నిజానిజాలు

వెల్లడించడంతో పాటు ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వార్డు సభ్యులకు శిక్షణ

కేసముద్రం, ఫిబ్రవరి. 23, తరంగాలు: మండల కేంద్రంలోని సోమవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఐదు రోజుల శిక్షణలో భాగంగా రెండవ విడత 15 గ్రామపంచాయతీ వార్డు మెంబర్లకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీఓ హరీష్ మాట్లాడుతూ తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018 నిబంధన ప్రకారం గ్రామ పంచాయతీ విధులు బాధ్యతలు, పారిశుద్ధం, చెట్లను పెంచడం, వృక్ష సంపద, వీధి దీపాల పర్యవేక్షణ , మరుగు దొడ్ల నిర్మాణాలు చేపట్టే చర్యలు, సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల విధులు బాధ్యతలు అనే అంశాల పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్స్ రాంమూర్తి, నాగార్జున, శ్రీను, రాజ్ కుమార్, శ్రీనివాస్ ,వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నల్ల రిబ్బన్లు ధరించి బిజెపినాయకుల నిరసన

అధికార పార్టీ అహంకారంతో చిన్నారి మృతి బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు

కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా,ప్రతినిధి, ఫిబ్రవరి. 23, తరంగాలు: అధికార పార్టీ అహంకారంతో చిన్నారి మృతి చెందిందని బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షులు వల్లబోయి వెంకటేశ్వర్లు అన్నారు.బిజెపి నాయకుల అక్రమ అరెస్ట్ లకు నిరసనగా తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం బిజెపి నాయకులు మూతికి నల్ల రిబ్బన్ ధరించి నిరసన చేపట్టారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బాన్సువాడలో ఓ హిందూ మహిళపై,మతోన్మాదులు అత్యాచార యత్నానికి పాల్పడిన సంఘటనకు నిరసనగా బంద్ కి పిలువునిచ్చిన బిజెపి-హిందూ సంఘాల నాయకులను అక్రమంగా అరెస్టు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ పిరికి దుశ్చర్యను,సంతుష్టీకరణ

రాజకీయాలను తీవ్రంగా ఖండిస్తున్నామని,వారిని వెంటనే విడుదల చేసి, అసలైన నేరస్థుల పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాను. అధికార అహంకారానికి, ప్రభుత్వ బెదిరింపులకు భారతీయ జనతా పార్టీ భయపడే ప్రసక్తే లేదని,అక్రమ అరెస్టులు,పోలీసుల నిర్బంధాలు కాషాయ ప్రభంజనాన్ని ఆపలేవు తెలంగాణ సమాజం కోసం, ప్రజల హక్కుల కోసం బిజెపి నాయకులు,కార్యకర్తలు చేస్తున్న అలుపెరగని పోరాటం ఇది.ధర్మం గెలిచే వరకు ఈ పోరు ఆగదన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పొదిల నరసింహారెడ్డి ,కేసముద్రం మున్సిపాలిటీ కన్వీనర్ నాగేశ్వరా చారి,వెలిశాల సవిన్,సింగంశెట్టి మధుకర్,లంకలపల్లి శ్రీనివాస్,అనిల్ బచ్చు లక్ష్మీనారాయణ,బానోత్ సంపత్,చక్రధర్,రమేష్, వీరభద్ర చారి పాల్గొన్నారు.

గ్రామ న్యాయవేదిక పనులు పనులు ప్రారంభించిన స్థానిక సర్పంచ్ అన్నం స్వప్న బ్రహ్మారెడ్డి

జఫర్గడ్ ప్రతినిది, ఫిబ్రవరి 23, తరంగాలు: మండల కేంద్రంలోని జీతం గ్రామంలో గ్రామ న్యాయవేదిక పనులను కొబ్బరి కాయకొట్టి పనులు స్థానిక సర్పంచ్ గ్రామాభివృద్ధి కమిటీ చైర్మెన్ అన్నం స్వప్న బ్రహ్మరెడ్డిప్రారంభించారు.గ్రామ పంచాయతీ కూడలిలో నూతనంగా నిర్మిస్తున్నా గ్రామ న్యాయవేదిక చివరి దశ పనులలో భాగంగా కొబ్బరికాయ కొట్టి స్లాబ్ పనులను ప్రారంభించిన స్థానిక సర్పంచ్ గ్రామాభివృది కమిటీ చైర్మెన్ అన్నం స్వప్న బ్రహ్మరెడ్డి వారి వెంట ఉప సర్పంచ్ గంగరాజు పంచాయతీ కార్యదర్శి హరీష్,మాజీ సర్పంచ్ అన్నెపు పద్మా అశోక్ , గుజ్జరీ రాజు ,గ్రామశాఖ అధ్యక్షులు ఎండీ ఆజ్మియ, వార్డ్ మెంబర్స్ కూరపాటి విజయ్ కుమార్,ఎండీ అంకుష్, సోన్నాయిల నాగరాజు,గుండెబోయిన రాజు, ఎండీ కాశిమ్,నరేందర్ రెడ్డి, కశిరబోయిన రాజు,పొట్లచెర్ల అనిల్, తదితరులు పాల్గొన్నారు గ్రామ పంచాయతీ కూడలిలో నూతనంగా నిర్మిస్తున్నా గ్రామ న్యాయవేదిక చివరి దశ పనులలో భాగంగా కొబ్బరికాయ కొట్టి స్లాబ్ పనులను ప్రారంభించిన మన స్థానిక సర్పంచ్ గ్రామాభివృద్ధి కమిటీ చైర్మెన్ అన్నం స్వప్న బ్రహ్మరెడ్డి వారి వెంట ఉప సర్పంచ్ గంగరాజు పంచాయతీ కార్యదర్శి హరీష్ మాజీ సర్పంచ్ అన్నెపు పద్మా అశోక్ , గుజ్జరీఊ రాజు ,గ్రామశాఖ అధ్యక్షులు ఎండీ ఆజ్మియ వార్డ్ మెంబర్స్ కూరపాటి విజయ్ కుమార్ ఎండీ అంకుష్, సోన్నాయిల నాగరాజు గుండెబోయిన రాజు ఎండీ కాశిమ్ నరేందర్ రెడ్డి కశిరబోయిన రాజు పొట్లచెర్ల అనిల్ తదితరులు పాల్గోన్నారు.

బాలకృష్ణ చిత్రపటానికి నివాళులర్పించిన యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు అల్లం గణేష్ యాదవ్

మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి,ఫిబ్రవరి. 23, తరంగాలు:గూడూరు మండలం సాంబయ్యపల్లి గ్రామానికి చెందిన చల్ల బాల కృష్ణ ఇటీవలే మృతి చెందగా సోమవారం వారి దశదిన కర్మ కార్యక్రమానికి యువజన కాంగ్రెస్ మహబూబాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు అల్లం గణేష్ యాదవ్ హాజరై వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారితోపాటు ఎండి రషీద్ ఖాన్,తోట అఖిల్ పటేల్,ముజ్జు షేక్,భుక్య అరుణ్, ఎండి రఫీ,భుక్య జగన్,కుమార్, గౌస్, ఎండి సమీర్,కాట్రేవుల హరి కృష్ణ,సాయి,తదితరులు పాల్గొన్నారు.

మిత్రుని జ్ఞాపకార్థం కుటుంబానికి ఆర్థిక సహాయం

కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, ఫిబ్రవరి. 23, తరంగాలు:సాధారణంగా మిత్రుడు మృతి చెందితే అతని కుటుంబానికి క్లాస్మేట్లు ఆర్థిక సహాయం అందించడం చూస్తుంటాం. అయితే ఇక్కడ స్నేహానికి మరో కొత్త అర్థం దొరికింది. కొన్ని సంవత్సరాల క్రితమే మృతి చెందిన తమ స్నేహితుడు ప్రశాంత్ జ్ఞాపకాన్ని గుర్తుచేసుకుంటూ, ఆయన తండ్రి సందిరి ఈశ్వర్ ఇటీవల మృతి చెందిన సందర్భంగా కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు.క్లాస్మేట్లు.కేసముద్రం స్టేషన్ జడ్పీ హైస్కూల్‌కు చెందిన 2009--2010 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఈ మానవీయ కార్యక్రమానికి ముందుకు వచ్చారు. మొత్తం 18 మంది స్నేహితులు స్పందించి రూ.5 వేల విలువైన నిత్యావసర సరుకులను సోమవారం ఈశ్వర్ కుటుంబ సభ్యులకు అందజేశారు. "మా స్నేహితుడు లేకపోయినా, అతని జ్ఞాపకం ఎప్పటికీ మాతోనే ఉంటుంది. అతని కుటుంబానికి అండగా నిలవడం మా బాధ్యతగా భావించాం" అని వారు తెలిపారు.స్నేహితుడి మరణానంతరం కూడా అతని కుటుంబాన్ని మరవకుండా సహాయం అందించడం పట్ల గ్రామస్థులు, పలువురు మేధావులు ఆ బ్యాచ్ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో బెజ్జంకి భాస్కర్, బొలగాని గణేష్, బోడ రమేష్, అంబాల శరత్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమమే లక్ష్యంగా టీఎస్ఎస్ఏ కృషి -జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో,ఫిబ్రవరి 23,తరంగాలు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ (యూూూ) విద్యార్థి విభాగం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ నిరంతరం విద్యార్థుల సమస్యలు, హక్కులు, సంక్షేమం కోసం కృషి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడంలో, సామాజిక బాధ్యతను

బలోపేతం చేయడంలో టీఎస్ఎస్ఏ కీలక పాత్ర పోషిస్తున్నదని తెలిపారు. భవిష్యత్తులో కూడా విద్యార్థుల ప్రయోజనాల కోసం మరింత చురుగ్గా పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా టీఎస్ఎస్ఏ నాయకులు జిల్లా కలెక్టర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దామాల సత్యం, జిల్లా అధ్యక్షుడు బయ్యన వీరబాబు, జిల్లా కార్యదర్శి వరద సాయికుమార్‌తో పాటు సంఘ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకోవాలి

స్వచ్ఛంద సామాజిక సేవా కార్యకర్త ఉత్తమ అవార్డు గ్రహీత మాణిక్యరావు

వర్ధన్నపేట ప్రతినిధి, ఫిబ్రవరి 23,తరంగాలు : విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకోవాలని, క్రమశిక్షణతో ఉన్నప్పుడే ఉన్నత చదువులు చదివి ప్రయోజకులుగా స్థిరపడుతారని స్వచ్ఛంద సామాజిక సేవా కార్యకర్త ఉత్తమ అవార్డు గ్రహీత మాణిక్యరావు తెలిపారు.వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామములోని కాకతీయ స్కూల్‌లో ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అధ్యక్షతన మానవతా విలువలు, లక్ష్యం, క్రమశిక్షణ సామాజిక అంశాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా స్వచ్ఛంద సామాజిక సేవా కార్యకర్త ఉత్తమ అవార్డు గ్రహీత మాణిక్యరావు పర్యవేక్షించి విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.విద్యార్థులు తమ జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించడానికి మరియు మంచి వ్యక్తిత్వ రూపకల్పనకు క్రమశిక్షణ చాలా ముఖ్యం అని,నమయపాలన, పెద్దలను,గురువులను గౌరవించడం, చదువుపై దృష్టి పెట్టడం మరియు పాఠశాల నియమాలను పాటించడం వంటి అలవాట్లు విద్యార్థులకు విజయానికి బాటలు వేస్తాయన్నారు.క్రమశిక్షణతో ఒత్తిడి తగ్గి, ఆత్మవిశ్వాసం పెరుగుతుందని,విద్యార్థులు ఉన్నత స్థాయికి లక్ష్యాన్ని సాధించాలంటే క్రమశిక్షణతో మరియు మానవతా విలువలతో కూడిన జీవితాన్ని గడపాలని అన్నారు.క్రమశిక్షణ అనేది కేవలం చదువుకే పరిమితం కాకుండా, జీవితకాలమంతా ఉపయోగపడే ఒక ఉత్తమ అలవాటు. దీని వల్ల వ్యక్తిగత ఎదుగుదలతో పాటు, సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని తెలిపారు.మనమందరం దేశం కోసం బతకాలని, ఉద్యోగం చేయాలని, దేశం కోసం చనిపోవాలని, కన్నతల్లి దండ్రులను, పెద్దలను, ఉపాధ్యాయులను ఎల్లవేళలా గౌరవించాలని, హింస జయించాలని దేశ భక్తి పాటలతో, పర్యావరణం నాటిక ద్వారా మానవతా విలువలు చూపించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి నడవడిక కలిగి ఉండాలని, క్రమశిక్షణతో మెలగాలని, శ్రద్ధాసక్తులతో విద్యను అభ్యసించాలని సూచించారు.పిల్లలు క్రమశిక్షణతో చదవాలని, కష్టాన్ని ఇష్టంగా మార్చుకొని చదవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం. సాయిలు,

సదాశివుడు, కె. అరవింద్, సురేష్, ఇల్లయ్య విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

మార్నేని రవీందర్ రావు ను కలిసిన 6వ వార్డ్ కౌన్సిలర్ మాలోత్ దేవేందర్

వర్ధన్నపేట ప్రతినిధి, ఫిబ్రవరి 23,తరంగాలు :వర్ధన్నపేట నూతనంగా ఎన్నికైన మున్సిపాలిటీ 6వ వార్డ్ కౌన్సిలర్ మాలోత్ దేవేందర్ మాజీ టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు ను వారి నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు కు కౌన్సిలర్ దేవేందర్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెత్య నాయక్, వెంకన్న,చందులాల్, రవి, యాకు, రాజేందర్, డి సి తండా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవిజయలక్ష్మి గ్రామ సంఘం ఆధ్వర్యంలో ఈసీ సమావేశం

వర్ధన్నపేట ప్రతినిధి, ఫిబ్రవరి 23,తరంగాలు : వర్ధన్నపేట మండలం రామోజీ కుమ్మరిగూడెం తండా గ్రామంలో శ్రీవిజయలక్ష్మి గ్రామ సంఘం ఈసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ భూక్య సుశీల శంకర్ నాయక్ ,ఉప సర్పంచ్ తిరుపతి ,వార్డు సభ్యులతో పాటు ,మాజీ సర్పంచ్ ,సిసి రేణుక, గ్రామ కార్యదర్శిని మహిళా సంఘం సభ్యులు శాలువా కప్పి ఘనంగా సన్మానం చేశారు.

మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి జి.ఆర్.సి ఒక వేదికగా పనిచేస్తుంది

దమ్మన్నపేటలో ఘనంగా జెండర్ రిసోర్స్ సెంటర్ (జిఆర్‌సి) వేదిక సమావేశం

వర్ధన్నపేట ప్రతినిధి, ఫిబ్రవరి 23,తరంగాలు :వర్ధన్నపేట మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో మహిళా సాధికారత, లింగ సమానత్వమే ధ్యేయంగా జి.ఆర్.సి (జెండర్ రిసోర్స్ సెంటర్) వేదిక సమావేశాన్ని మంగళవారం ఆత్యంత ఉత్సాహంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామంలో మహిళల హక్కులు, సామాజిక చైతన్యంపై భారీ ర్యాలీని నిర్వహించి, అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ సమావేశంలో పాల్గొన్న ఏపీఎం రమణాచారి మాట్లాడుతూ జెండర్ రిసోర్స్ సెంటర్ తో గ్రామంలో మహిళా సాధికారత, లింగ సమానత్వమే ధ్యేయంగా మహిళల హక్కులు, సామాజిక చైతన్యంపై ,సమాజంలో మహిళలు, పురుషులు సమానమేనన్న భావనను పెంపొందించాలని, బాల్య వివాహాల నిరోధానికి అందరూ కృషి చేయాలని మరియు అంగన్వాడీ, ఆశా వర్కర్ల ద్వారా అందుతున్న ఆరోగ్య సేవలను, విద్యాశాఖ ద్వారా పిల్లలకు అందుతున్న నాణ్యమైన విద్యను సమన్వయం చేసుకోవాలని వివరించారు. గ్రామస్థాయిలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి జి.ఆర్.సి ఒక వేదికగా పనిచేస్తుందని, అన్నిశాఖల అధికారులు అందుబాటులో ఉండి మహిళా అభివృద్ధికి తోడ్పడాలని సర్పంచ్ దుబ్బ అంజయ్య సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి జ్యోతి లత,సిసి రేణుక,ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేష్ నాయక్,ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్,గ్రామ సంఘం అధ్యక్షురాలు (కన్వీనర్),అధ్యక్షులు రజిత,మమత,రాధిక,రజిత.వి.ఓ.ఏలు పద్మ

అనిత,సుజాత,శిరీష,కమిటీ సభ్యురాలు మాధవి అంగన్వాడీ కార్యకర్తలు కమల,అరుణ, రమపూలమ్మ,ఆశా వర్కర్లు, ఫీల్డ్ అసిస్టెంట్,ఉపసర్పంచ్ మెరుగు రమేష్,వార్డు సభ్యులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

చల్లటి నీటితో స్నానం శరీరానికి ఉల్లాసం మనసుకు తేజస్సు

డెస్క్, ఫిబ్రవరి 23 (తరంగాలు ప్రతినిధి): ఉదయపు అలవాటుగా చల్లటి స్నానం చల్లటి నీటితో స్నానం చేయడం పాతకాలం నుంచి అనుసరిస్తున్న అలవాటుగా పెద్దలు చెబుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో బావి లేదా చేతి పంపు నీటితో స్నానం చేయడం సాధారణమని పేర్కొంటున్నారు. ఉదయం చల్లటి నీటితో స్నానం చేస్తే శరీరం చురుకుగా మారుతుందని అంటున్నారు. శారీరక ప్రయోజనాలు చల్లటి నీరు శరీర రక్తప్రసరణను ఉత్తేజితం చేస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. అలసట తగ్గించడంలో, కండరాలకు తేజస్సు ఇవ్వడంలో ఇది సహాయపడుతుందని పేర్కొంటున్నారు. చర్మానికి కట్టుదిట్టత ఇవ్వడంలో కూడా చల్లటి స్నానం కొంతమేర ఉపకరిస్తుందని సూచిస్తున్నారు. మానసిక ఉల్లాసం చల్లటి నీటితో స్నానం చేయడం మనసుకు కూడా ఉల్లాసాన్ని ఇస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఉదయం మత్తు తగ్గి, చురుకుదనం పెరుగుతుందని పేర్కొంటున్నారు. ఒత్తిడి తగ్గించడంలో కూడా ఇది సహాయపడవచ్చని సూచిస్తున్నారు. జాగ్రత్తలు అవసరం అయితే తీవ్రమైన చలి కాలంలో లేదా ఆరోగ్య సమస్యలు ఉన్నవారు చల్లటి నీటితో స్నానం చేసే ముందు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. గుండె సమస్యలు ఉన్నవారు వైద్యుల సలహా తీసుకోవాలని సూచిస్తున్నారు. శరీర పరిస్థితిని బట్టి నిర్ణయం తీసుకోవాలని పేర్కొంటున్నారు. సరైన విధంగా అలవాటు చేసుకుంటే చల్లటి నీటితో స్నానం శరీరానికి, మనసుకు ఉల్లాసాన్ని అందించే పద్ధతిగా నిలుస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ఐనవోలు, ఫిబ్రవరి 23,తరంగాలు : ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను అయినవోలు పోలీసులు పట్టుకున్నారు. వర్ధన్నపేట ఆకేరూ వాగు నుండి ఇసుక అక్రమంగా రవాణా జరుగుతున్నదని నమ్మదగిన సమాచారం మేరకు అయినవోలు ఎస్సై పస్తం శ్రీనివాస్ తన సిబ్బంది తో కలిసి తనిఖీ నిర్వహించారు.ఈ తనిఖీల్లో చింతకుంట గ్రామంలో 2- ట్రాక్టర్లు పట్టుకున్నారు.కట్రాల గ్రామానికి చెందిన చెవ్వ సాంబ కుమార్ తండ్రి ఎల్లయ్య,చెక్కొండ లింగం తండ్రి బలయ్య అనువారు వారి ఓనర్లు అయిన మహమ్మద్ కరీం, నాంపల్లి కుమార్ రాజా ఆదేశాల మేరకు ఇసుకను రవాణా చేస్తుండగా అట్టి వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయుచున్నట్లు ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపారు.

ఘనంగా కాకిరాల హరిప్రసాద్ జన్మదిన వేడుకలు

తొర్రూర్, ఫిబ్రవరి 23,తరంగాలు : మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలం సోమారం గ్రామంలో శ్రీ కాకిరాల అనసూర్యమ్మ మెమోరియాల్ బారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, ప్రముఖ రాజకీయ నాయకులు కాకిరాల హరిప్రసాద్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కాకిరాల హరిప్రసాద్ కు శాలువా కప్పి సన్మానించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాయపర్తి మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు,లి రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షులు సురేందర్ రాథోడ్, మండల పార్టీ నాయకులు లేతకుల రంగా రెడ్డి, గజాపెల్లి ప్రసాద్, చందు రామ్, తదితరులు పాల్గొన్నారు.

సొమ్య కుటుంబానికి అండగా ప్రభుత్వం

నిజామాబాద్, ఫిబ్రవరి 23 (తరంగాలు ప్రతినిధి): గంజాయి అక్రమ రవాణాదారుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన నిజామాబాద్ జిల్లాకు చెందిన ఎక్సైజ్ కానిస్టేబుల్ గాజుల సౌమ్య కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచింది. ముఖ్యమంత్రి పినుమల రేవంత్ రెడ్డి ఇప్పటికే సౌమ్య కుటుంబానికి కోటి రూపాయల చెక్కును అందజేశారు. అదేవిధంగా సౌమ్య సోదరుడు గాజుల శ్రవణ్‌కు జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగ నియామక పత్రాన్ని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అందజేశారు. కుటుంబానికి ఆర్థిక, ఉద్యోగ భరోసా కల్పించడం ద్వారా ప్రభుత్వ నిబద్ధతను చాటుకున్నట్లు అధికారులు తెలిపారు. సౌమ్య మరణించి కేవలం ఇరవై మూడు రోజుల్లోపే పరిహారం, ఉద్యోగ నియామకం చేపట్టడం ప్రజా ప్రభుత్వ సంకల్పానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులను కంటికి రెప్పలా కాపాడుకోవడం తమ బాధ్యత అని స్పష్టం చేశారు.ఎక్సైజ్ శాఖ సిబ్బందికి అవసరమైన రక్షణ చర్యలపై, ఆయుధాల కల్పన అంశంపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం వెల్లడించింది.